క్లుప్తంగా

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు ప్లాంకు, పెన్నులు అందిస్తున్న పూర్వ విద్యార్థి జగదీశ్

సీతంపేట: జీవీఎంసీ పాఠశాల పూర్వ విద్యార్థి తన పెద్ద మనసు చాటుకున్నాడు. 25వ వార్డు మధురానగర్‌లోని జీవీఎంసీ హైస్కూల్ పూర్వ విద్యార్థి జగదీశ్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అవసరమైన ప్లాంక్, పెన్నులు, స్కేల్, పెన్సిల్ ఉచితంగా అందజేశాడు. టెన్త్ పరీక్షలకు హాజరవుతున్న 89 మంది విద్యార్థులకు బుధవారం ఎగ్జామ్స్ మెటీరియల్ పంపిణీ చేశాడు. ఐదేళ్లుగా జగదీశ్ టెన్త్ విద్యార్థులకు పరీక్షల సామగ్రి అందజేస్తున్నట్టు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఉమా తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.ఎస్.ఎన్.రెడ్డి, రమణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేర్ ఆస్పత్రి సహకారంతో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవి, పి.కమల ఒక ప్రకటనలో తెలిపారు. వుడా కాలనీలోని ఈస్ట్ పార్కులో ఉదయం 6.30 నుంచి 9.30 గంటల వరకు బీపీ, ఆర్‌బీఎస్, ఈసీజీ వంటి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. మురళీనగర్, మాధవధార పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

24, 25 తేదీల్లో బ్యాంకుల సమ్మె



ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

సీతమ్మధార: యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు బుధవారం ద్వారకానగర్‌లో గల ఇండియన్ బ్యాంక్ జోనల్ ఆఫీస్ వద్ద ఆఫీసర్లు, క్లర్కులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ 24, 25 తేదీల్లో బ్యాంకులు సమ్మెకు వెళ్తున్నాయని గుర్తుచేశారు. ముఖ్యమైన డిమాండ్లు, ఐదు రోజుల పని దినాలు, బ్యాంకుల్లో నియామకాలు తదితర అంశాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్య నాయకులు ఆఫీసర్స్ యూనియన్ కార్యదర్శి శివప్రసాద్, అవార్డు స్టాఫ్ యూనియన్ జాయింట్ జనరల్ సెక్రటరీ బి.మహేశ్వరరావు, అధిక సంఖ్యలో బ్యాంకుల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రూ.19.9 లక్షలతో కాలువల పనులు



శంకుస్థాపన చేస్తున్న డీఈఈ రామ సుబ్బారావు, స్థానిక నాయకులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు జగన్నాథపురంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం అధికారులు, స్థానిక నాయకులు శంకుస్థాపన చేశారు. జగన్నాథపురంలో ఎస్‌డబ్ల్యూ కాలువల గోడలను పెంచి, పైన శ్లాబులు వేసేందుకు జీవీఎంసీ నుంచి రూ.19.9 లక్షల నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ రవణమ్మ, డీఈఈ రామ సుబ్బారావు, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

40 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: గంజాయి రవాణా చేస్తున్న నిందితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి 40 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. విశాఖ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తమ సిబ్బందితో కలిసి బుధవారం విశాఖ రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. బిహార్‌కు చెందిన పంకజ్‌కుమార్, గోల్డెన్‌కుమార్ వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.2లక్షల విలువైన 40 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు. వీరు విశాఖపట్నం మీదుగా ముంబైకు గంజాయిని తీసుకెళ్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

జంక్షన్.. టెన్షన్..!

- మాధవధార కూడలిలో వైన్‌షాపు ఏర్పాటుతో సమస్యలు
- నిత్యం మందుబాబుల ఆగడాలతో స్థానికుల ఆందోళన
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు



మాధవధార కూడలిలో అడ్డదిడ్డంగా వాహనాల రాకపోకలు



మాధవధార జంక్షన్ వద్ద వైన్ షాప్ ముందు ఇష్టానుసారంగా నిలిపిన ద్విచక్ర వాహనాలు

మర్రిపాలెం: ఎప్పుడు ప్రశాంతకరమైన వాతావరణంలో నివసించే మాధవధార ప్రజలు ఇటీవల ఇక్కడ ఏర్పాటు చేసిన వైన్‌షాపు వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన ఈ ప్రాంతం నేడు భయాందోళనలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్కడ పడితే అక్కడ మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతులిచ్చింది. జీవీఎంసీ 50వ వార్డు మాధవధార జంక్షన్‌కు కూతవేటు దూరంలో ఏర్పాటు చేసిన ఓ మద్యం దుకాణం వల్ల ట్రాఫిక్, ఇతర సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇక్కడ పూర్తిగా జనావాసాల మధ్య వైన్ షాప్ ప్రారంభించడంతో స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు మీదే చిందులు

నాలుగు రోడ్ల జంక్షన్ కావడంతో అటు బిర్లా కూడలి హైవేకు వెళ్లాలన్నా.. ఇటు మాధవ స్వామి ఆలయానికి, మాధవధార లాస్ట్ బస్‌స్టాప్ మీదుగా ఆర్ అండ్ బీ జంక్షన్‌కు, కైలాసపురం మీదుగా హెచ్‌బీ కాలనీ వరకు వెళ్లాలన్నా ఈ ప్రధాన రహదారి మీదుగానే ప్రయాణాలు సాగిస్తారు. హైవే మీద వెళ్తే సిగ్నల్స్ ఎక్కువగా ఉండటంతో, దానికి సమాంతర రోడ్డు కావడంతో ఈ దిశలో ఎక్కువగా వాహనాలు వెళ్తుంటాయి. ఈ క్రమంలో మాధవధార జంక్షన్ వద్ద మద్యం షాపు ఏర్పాటు చేయడం వల్ల ఆందోళనకరంగా మారిందని పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరు ఏ దిక్కు నుంచి వస్తారో తెలియక జాగ్రత్తగా రోడ్డు దాటుతుంటారు. ఇప్పుడు దీనికి తోడు వైన్ షాప్ దగ్గర మందుబాబులు ఎక్కువగా ఉండటంతో అటుగా రాకపోకలకు మహిళలు, పాదచారులు భయపడుతున్నారు. రోడ్డు మీదే మద్యం తాగేవారు కొందరైతే, రోడ్డు మధ్యలో బైకులు పార్క్‌చేసి వెళ్లే వారు మరి కొందరు. మందుబాబులు వైన్ షాపు వద్దే మద్యం తాగుతూ ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు.

కొరవడిన పోలీస్ నిఘా

ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక క్షేత్రంగా పేరున్న మాధవధారలో వికృత చేష్టలు చేస్తున్న వారిపై పోలీసుల నిఘా లేకపోవడంతో ఎన్నో ప్రమాదాలకు దారితీస్తోంది. మద్యం మత్తులో తూలుతూ వాహనాల చోరీలు, పెట్రోల్ దొంగతనాలు వంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నా.. పట్టించుకునే నాథుడే లేదని స్థానికులు చెబుతున్నారు. సాయంత్రమైతే చాలు మందుబాబుల చిందులతో పిల్లలు, మహిళలు, యువత రోడ్లపైకి రావాలంటేనే భయపడుతున్నారు. ఏ అవసరానికైనా ఎవరో ఒకరిని వెంట పెట్టుకుని వెళ్తున్నామంటూ పలువురు మహిళలు చెబుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించి మందుబాబుల ఆగడాలకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ



వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో నేతలకు కేక్ తినిపిస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు ధర్మానగర్‌లో పార్టీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ మాజీ చైర్మన్ కె.కె.రాజు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి కె.కె.రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలన అందించిన మహానేత వైఎస్సార్ మరణం అనంతరం ఆయన ఆశయాలను కొనసాగించాలని సదుద్దేశంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని స్థాపించారన్నారు. ఓదార్పు యాత్ర, ప్రజా సంకల్ప యాత్రల ద్వారా ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని వారి ఆశీస్సులతో అత్యధిక మెజారిటీతో పార్టీని గెలిపించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అనేక సంక్షేమ ఫలాలను పేదలకు అందించి అండగా నిలిచారన్నారు. వివిధ కారణాలతో అధికారం కోల్పోయినప్పటికీ సుమారు 40 శాతం ఓటర్లు పార్టీని విశ్వసించి ఓట్లు వేశారని, మళ్లీ వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు పార్టీ తరపున ఎల్లప్పుడు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, నాయకులు కర్రి రామారెడ్డి, సేనాపతి అప్పారావు, గుజ్జు వెంకటరెడ్డి, పైడి రమణ, పీలా వెంకటలక్ష్మి మాజీ డైరెక్టర్లు జిల్లా కమిటీ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, బూత్ కన్వీనర్లు, మహిళలు, యువత, కార్యకర్తలు పాల్గొన్నారు.

మురళీనగర్‌లో తపాలా సేవలు ప్రారంభం



పోస్టాఫీస్ ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ ప్రసాద్, అసోసియేషన్ అధ్యక్షుడు వరప్రసాద్

మురళీనగర్: మురళీనగర్‌లో తపాలా కార్యాలయం సేవలను పునరుద్ధరించారు. సెక్టార్–13లో మురళీనగర్, మాధవదార పరిసర ప్రాంతాలకు సేవలు అందించిన తపాలా కార్యాలయాన్ని అద్దె ఎక్కువగా ఉండటంతో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు తరలించిన విషయం తెలిసిందే. దీంతో స్థానికులు సేవింగ్, ఆర్డీ సేవలు వినియోగించుకోవడానికి జాతీయ రహదారి దాటి వెళ్లాల్సి రావడంతో ప్రమాదాలు ఎదుర్కొనేవారు. ఈ సమస్యపై మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్‌తో కూడిన సభ్యుల బృందం తపాలా శాఖ అధికారులు, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎంపీ భరత్‌ల దృష్టికి తీసుకురావడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. మాధవధారలోని మాధవ యువజన సమాజం భవనంలో పోస్టాఫీస్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని బుధవారం 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, మురళీనగర్, మాధవధార రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ ప్రారంభించారు. ఇక్కడ తపాలా శాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇళ్ల స్థలాల హామీ నెరవేర్చండి



తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నేతలు పైడిరాజు, పడాల గోవింద్

సీతమ్మధార: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం సీతమ్మధార కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎం.రమేష్‌కు కార్యదర్శి పైడిరాజు, జిల్లా సమితి సభ్యులు పడాల గోవింద్, పాత్రపిల్లి చంద్రశేఖర్ తదితరులు పెద్ద సంఖ్యలో పేదల చేత వ్యక్తిగత దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా.. హామీ అమలుకు చర్యలు తీసుకోలేదన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3.20 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌లో ఇళ్ల స్థలాల కోసం నిధులు కేటాయించలేదన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో దీనిపై నిర్ణయం తీసుకోవాలని, లేని పక్షంలో పేదలను సమీకరించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి, మౌలిక సదుపాయాలు సమకూర్చి వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ రెహమాన్, జి.ఎస్.జె.అచ్యుత్‌రావు, సమితి సభ్యులు నెయ్యల నాగభూషణం, వా సపల్లి నల్లయ్య, ఆదారి ఆదినారాయణ, ఏఐవైఎఫ్ నాయకులు ఎస్.మధురెడ్డి, ఆర్.అశోక్, అద్దూరు శంకరరావు, లంక గోవింద్, లక్ష్మణ్‌రెడ్డి, ఇళ్లు లేని పేదలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.12.50 లక్షలతో అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు, శ్యామలాదీపిక

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార దరి ఏపీఎస్‌ఈబీ కాలనీలో అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె, బీజేపీ నేత శ్యామలాదీపిక, కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జీవీఎంసీ నిధులు రూ.12.50 లక్షలతో ఈ ప్రాంతంలో డ్రైనేజ్, కల్వర్టు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. శ్యామలాదీపిక మాట్లాడుతూ స్థానిక ప్రజలు ఈ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో జీవీఎంసీ ద్వారా నిధుల విడుదలకు ఆయన కృషి చేయడంతో శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జోన్–3 కమిషనర్ శివప్రసాద్, ఏఈ శ్రీనివాసరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్, టీడీపీ నాయకులు గొంపా ధర్మారావు, వసంతరావు, వీరభద్రరావు, జగ్గారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూలాలను అరికడితేనే మహిళలకు భద్రత



ప్రసంగిస్తున్న డాక్టర్ శైలజ

సీతంపేట: సోషల్ మీడియా ప్రభావం యువతపై చాలా ఎక్కువగా ఉందని గాయత్రి విద్యా పరిషత్ సైంటిస్ట్ డాక్టర్ శైలజ అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పీడీఎస్‌ఓ) జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి అధ్యక్షతన 'చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు – సామాజిక మూలాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. మనం వాడుతున్న యాప్స్‌లో వచ్చే యాడ్స్ న్యూడిటీని ఎక్స్‌పోజ్ చేస్తున్నాయన్నారు. 20 కిలో మీటర్ల పరిధిలో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయకూడదనే నిబంధన పెట్టారు కానీ, మద్యం షాపులను రెండు మూడు కిలోమీటర్ల దూరంలోనే ఏర్పాటు చేస్తూ యువతను మత్తులో ఉంచుతున్నారని విమర్శించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి ఆలోచించకుండా వాటిపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో సమాజంలో మార్పురాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. పీడీఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న వరుస అత్యాచార సంఘటనలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. పాలకులు చెబుతున్న మహిళా సాధికారత ఇదేనా అని ప్రశ్నించారు. సంస్థ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక రూపంలో మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు జరుగుతూనే ఉన్నాయని, దేశంలో గంటకు 47 ఘటనలు జరుగుతున్నాయని వివరించారు. ఇటువంటివి జరగకుండా మూలాలను అరికట్టాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్.ఆశా మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలకు, హత్యలకు కారణమవుతున్న మద్యం, మత్తుపదార్థాలు, పోర్న్ సైట్లను నిషేధించాలని డిమాండ్ చేసారు. సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్, జిల్లా అధ్యక్షుడు పి.విశ్వనాథ్, జిల్లా కమిటీ సభ్యులు రాజేష్, సతీష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మానవతా కథా రచయిత మునిపల్లె



మాట్లాడుతున్న రచయిత సూర్యారావు

సీతంపేట: మునిపల్లె రాజు గొప్ప తాత్విక మానవతా కథా రచయితని రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు పేర్కొన్నారు. మునిపల్లె రాజు శత జయంతి సందర్భంగా సహృదయ సాహితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన చర్చాగోష్టిలో ఆయన ప్రసంగించారు. మునిపల్లె రాజు రక్షణ శాఖ ఉద్యోగిగా దేశమంతటా తిరిగిన, తాను చూసినవి, విన్నవి, అనుభవాలు, అనుభూతులను అర్థమైన రీతిలో అక్షర చిత్రాలుగా మలిచారన్నారు. ఆయన కథల్లో ఆదర్శ జీవన విలువలు కనిపిస్తాయని చెప్పారు. బిచ్చగాళ్ల జెండా, అరణ్యంలో మానవయంత్రం రచనలు మార్క్సిజంపై అవగాహనకు అద్దం పడతాయన్నారు. తెలుగు కథా సాహిత్యంలో మేజికల్ రియలిజం అనే ప్రక్రియను మునిపల్లె ప్రవేశపెట్టారని తెలిపారు. ఆ ధోరణిలో రాసిన కథా సంపుటి అస్తిత్వనదం ఆవలి తీరానకు 2006లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వచ్చిందన్నారు. మునిపల్లె కథలన్నీ అనగారిన సమాజం, అభాగ్యులపై కరుణను కలిగిస్తాయని వివరించారు. కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, కె.జి.వేణు, చిన సూర్యనారాయణ, భీమేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు, రేపు మాస్టర్ ఇ.కె. ఆరాధనోత్సవాలు



మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య (ఫైల్)

తాటిచెట్లపాలెం: ది వరల్డ్ టీచర్ ట్రస్ట్(జగద్గురు పీఠం) వ్యవస్థాపకులైన కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య(మాస్టర్ ఇ.కె.) 41వ ఆరాధనా దినోత్సవం(వర్ధంతి) సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆఫ్ ఫంక్షన్స్ అజ్జరపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా దేశ, విదేశాల్లో పలు సేవా కార్యక్రమాలు, పూజాది క్రతువులను జగద్గురు పీఠం సోదర బృందం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 13వ తేదీ గురువారం సాయంత్రం నుంచి విశాఖ సాగరతీరంలోని మాస్టర్ ఇ.కె.సుందరవనంలో మాస్టర్ సి.వి.వి. ప్రార్థన, శ్రీ లక్ష్మీనారాయణ పూజ, రుద్రాభిషేకం, పూర్ణిమాధ్యానాదులు జరుగుతాయని చెప్పారు. ఈ నెల 14న తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లో జనశిక్షణ సంస్థాన్, జగద్గురు పీఠం సంయుక్తంగా మూడు నెలల పాటు నిర్వహించిన బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో ఉత్తీర్ణులైన 60 మంది మహిళలకు కేంద్ర ప్రభుత్వ సంబంధిత స్కిల్ ఇండియా వారి ధ్రువపత్రాలను అతిథుల చేతుల మీదుగా అందజేస్తామన్నారు. ఇక్కడ కుట్టు శిక్షణ పొంది ఎంపికైన నిరుద్యోగ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తామని తెలిపారు.

త్వరితగతిన పనులు పూర్తిచేయండి



హైవేపై గ్రీన్‌బెల్ట్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న బానాల శ్రీనివాసరావు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు పరిధి జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు అధికారులతో కలిసి పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న బాక్స్ క్రికెట్, వాలీబాల్ గ్రౌండ్, ఫ్లవర్ గార్డెన్‌లో లైటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి అప్పగించాలని అధికారులను ఆదేశించారు. పనులు త్వరగా పూర్తి చేస్తే అసెంబ్లీ సమావేశాల తర్వాత అభివృద్ధి పనులను ప్రారంభించే యోచనలో ఉన్నట్టు తెలిపారు. దీనిపై అధికారులు స్పందిస్తూ 20 రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. ఈఈ ఢిల్లేశ్వరరావు, డీఈ రామసుబ్బారావు, ఏఈ రవణమ్మ, ఎలక్ట్రికల్, హార్టికల్చర్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఘన వీడ్కోలు

స్టూడెంట్లతో కలిసి డ్యాన్స్‌లతో అలరించిన ఉపాధ్యాయులు



నృత్యంతో అలరిస్తున్న విద్యార్థినులు



డ్యాన్స్ చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు



టెన్త్ విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న ఉపాధ్యాయులు

సీతమ్మధార: పీఅండ్‌టీ కాలనీలోని ఎన్‌ఎంసీ హైస్కూల్‌లో బుధవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు సందడిగా నిర్వహించారు. తమకు ఇన్నేళ్ల పాటు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. టెన్త్ పరీక్షల్లో విజయం సాధించేందుకు వారి వద్ద ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఉత్తమ మార్కులతో పాసై పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఫేర్‌వెల్ డేలో భాగంగా విద్యార్థులు పలు రకాల నృత్యాలతో అలరించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి డ్యాన్స్‌లు చేయడం విశేషం. అందరి ఆటపాటలతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది.

పార్కింగ్ ఇలా.. రాకపోకలెలా..?



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో మెయిన్ రోడ్డు మీద పార్క్ చేసిన వాహనాలు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ట్రాఫిక్ కష్టాలు తీరకపోగా.. రోజురోజుకూ రెట్టింపవుతున్నాయని స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక్కడ ఒకవైపు బాలయ్యశాస్త్రి లేఅవుట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు ఉండగా.. స్థానిక అభయాంజనేయ స్వామి గుడి జంక్షన్ దరి షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట వాహనాలు రాంగ్ పార్కింగ్ చేస్తున్నారు. ఇక్కడి దుకాణాల ఎదురుగానే ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలను యథేచ్ఛగా నిలుపుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ మార్గంలోని కార్యాలయాలు, దుకాణాలు, బ్యాంకులకు వచ్చే వినియోగదారులు కూడా ఇక్కడే వాహనాలు పార్క్‌చేయడం గమనార్హం. ఇక్కడి మెయిన్ రోడ్డులోని వాణిజ్య సముదాయాలు, కల్యాణ మండపాలకు వచ్చే వినియోగదారులు, ప్రజలు తమ వాహనాలను సెల్లార్‌కు బదులుగా రోడ్డు మీదే నిలుపుతున్నారు.

ఈ మార్గంలో అధిక సంఖ్యలో పాఠశాల విద్యార్థులతో వెళ్లే ఆటోలు రాకపోకలు సాగిస్తుంటాయి. తరచూ ట్రాఫిక్ జామ్ కారణంగా విద్యార్థులు, ఉదయం పాఠశాలలకు, సాయంత్రం ఇళ్లకు వెళ్లడం ఆలస్యమవుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ మార్గంలో ఎక్కడా ట్రాఫిక్ కానిస్టేబుల్ జాడ లేదు. దీంతో వాహనా పార్కింగ్‌కు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని స్థానికులు, పాదచారులు చెబుతున్నారు. ఈ మార్గంలో పోర్టు స్టేడియం, సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్, అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రాంతాలకు ప్రజల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. టీపీటీ కాలనీ, సీతమ్మధార, హెచ్‌బీ కాలనీ ప్రాంతాల వాసులు కూడా ప్రయాణిస్తుంటారు. తహశీల్దార్ కార్యాలయం, ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి, ఈపీడీసీఎల్ కార్యాలయం, యూనియన్ బ్యాంకు, ఇతర దుకాణాలకు ఈ మార్గం ద్వారానే ప్రజలు ప్రయాణాలు సాగిస్తారు. నిత్యం బాలయ్యశాస్త్రి లేఅవుట్ మెయిన్ రోడ్డు మీదే వాహనాలు పార్కింగ్ చేస్తున్నా.. ద్వారకా ట్రాఫిక్ పోలీసులు పత్తాలేరని స్థానికులు, పాదచారులు చెబుతున్నారు. రాంగ్ పార్కింగ్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.